

కారు..బోరు!

2019 మెదక్ పార్లమెంట్ ఫలితాలు	2023 అసెంబ్లీ ఫలితాలు (మెదక్ లోక్‌సభ పరిధి)	2024 మెదక్ పార్లమెంట్ ఫలితాలు
కొత్త ప్రభాకర్‌రెడ్డి (బీఆర్ఎస్) 5,96,048	బీఆర్ఎస్ 6,68,955	రఘునందన్‌రావు (బీజేపీ) 4,71,217
గాలి అనిల్‌కుమార్(కాంగ్రెస్) 2,79,621	కాంగ్రెస్ 4,20,881	నీలం మధు (కాంగ్రెస్) 4,32,078
రఘునందన్‌రావు (బీజేపీ) 2,01,567	బీజేపీ 2,11,626	పి.వెంకట్రామారెడ్డి (బీఆర్ఎస్) 3,96,790
బీఆర్ఎస్ మెజారిటీ 3,16,427	బీఆర్ఎస్ ఆధిక్యం 2,48,114	బీజేపీ మెజారిటీ 39,139

తాజా ఎన్నికల ఫలితాలు చర్చనీయాంశంగా మారాయి. ప్రధానంగా గులాబీ పార్టీ శిబిరాన్ని నైరాశ్యంలో పడేశాయి. అనూహ్యమైన ఫలితాలతో బీఆర్ఎస్ శ్రేణులు కుంగిపోతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇలాంటి పరిస్థితి ఎన్నడూ రాలేదని వాపోతున్నారు. ఇదే లోక్‌సభ పరిధిలో ఉన్న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు విస్తృత ప్రచారం చేసినా ఫలితం ఇలా ఉండంటే.. వారు దృష్టిపెట్టకుంటే డిపాజిట్ ఓట్లు కూడా గల్లంతయ్యేవని భావిస్తున్నారు.

● పార్లమెంట్ ఎన్నికల్లో దెబ్బతిన్న 'గులాబీ' ● ఆరునెలల్లోనే అటుఇటైన ఫలితాలు

● సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకలో స్వల్ప ఓట్ల ఆధిక్యం ● సంగారెడ్డి, పటాన్‌చెరు, మెదక్‌లో ఎదురుగాలి

● 'గులాబీ' శిబిరంలో తీవ్రనైరాశ్యం ● కంచుకోటలో ఓటమిపై పోస్టుమార్టం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 5 : మెదక్ లోక్‌సభ అంటే బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట. వరుసగా ఐదు ఎన్నికల్లో భారీ మెజార్టీలను సొంతం చేసుకున్న రికార్డు ఈ పార్టీకి ఉంది. బీఆర్ఎస్‌కు అధికారం ఉన్నా, లేకున్నా.. ఎలాంటి విపత్కర పరిస్థితులున్నా మెదక్‌లో మాత్రం గులాబీ పార్టీని ఆదరిస్తూనే ఉన్నారు. 2004, 2009 ఉద్యమ సమయంలోనూ, 2014లో తెలంగాణ ఏర్పాటవుతున్న సందర్భంలోనూ, 2014 ఉప ఎన్నికలోనూ, 2019లో పార్టీ ఐదేళ్ల పాలనకు రెఫరెండంగానూ ఈ లోక్‌సభ ఓటర్లు బీఆర్ఎస్‌ను గెలిపించారు. తాజా ఎన్నికల్లోనూ ఇదే పునరావృతం అవుతుందని ఆకాంక్షించారు. కానీ, అంచనాలను తలకిందులు చేస్తూ ఆ పార్టీకి మూడోస్థానం కట్టబెట్టారు.

మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలో సెగ్మెంట్ల వారీగా ఓట్ల వివరాలు, మెజారిటీ

సెగ్మెంట్	పోలైన ఓట్లు	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్	మెజారిటీ / పార్టీ
సిద్దిపేట	1,74,969	62,823	33,174	65,501	2,678 / బీఆర్ఎస్
మెదక్	1,75,409	67,374	55,588	40,776	11,786 / బీజేపీ
నర్సాపూర్	1,91,315	51,811	72,376	54,372	18,004 / కాంగ్రెస్
దుబ్బాక	1,64,952	50,873	31,641	66,714	15,841 / బీఆర్ఎస్
గజ్వేల్	2,25,607	56,811	65,539	85,432	19,893 / బీఆర్ఎస్
సంగారెడ్డి	1,79,801	70,310	75,287	27,874	4,977 / కాంగ్రెస్
పటాన్‌చెరు	2,60,541	1,03,775	94,294	54,581	9,481 / బీజేపీ
పోస్టల్ బ్యాలెట్	14,297	7,440	4,179	1,540	3,261 / బీజేపీ
మొత్తం	13,72,894	4,71,217	4,32,078	3,96,790	39,139 / బీజేపీ

ఆ నాలుగు చోట్లా ఫ్లాప్ షో

పటాన్‌చెరు, సంగారెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గాల్లో ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ పటాన్‌చెరులో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు లక్ష పైచిలుకు ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు 94వేల ఓట్లు వచ్చాయి. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి కేవలం 54వేల ఓట్లు పోలయ్యాయి. సంగారెడ్డిలోనూ ఎమ్మెల్యేగా చింతా ప్రభాకర్ ఉన్నారు. ఇక్కడ అత్యధికంగా కాంగ్రెస్‌కు 75వేలు, బీజేపీకి 70వేలు, బీఆర్ఎస్ మాత్రం 27 వేల ఓట్లే పోలయ్యాయి. నర్సాపూర్‌లోనూ కాంగ్రెస్‌కు 72,376 ఓట్లు పోలవ్వగా కారుకు కేవలం 54,372 ఓట్లు వచ్చాయి. ఇక మెదక్ నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్ పూర్తిగా వెనుకబడింది. బీజేపీ కంటే 27వేల ఓట్లు తగ్గాయి. అసెంబ్లీ ఫలితాల్లో సత్తాచాటిన ఈ నియోజకవర్గాల్లో ప్రస్తుతం 'కారు'పార్టీకి ఎదురుగాలి తగిలింది.

మూడు సెగ్మెంట్లలో ప్లస్

బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ఆ పార్టీకి పరువు దక్కిందనే చెప్పాలి. ఇక్కడ మొదటిస్థానంలో బీఆర్ఎస్‌ను ఆదరించారు. రెండోస్థానంలో ఉన్న కాంగ్రెస్ కంటే 20వేల ఓట్ల ఆధిక్యం లభించింది. బీజేపీ అభ్యర్థిది మూడోస్థానం. ఇక రఘునందన్‌రావు సొంత నియోజకవర్గమైన దుబ్బాకలో ఆయనకు భారీ మెజారిటీ దక్కుతుందని అంతా భావించారు. కానీ ఇక్కడ కూడా బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటింది. దాదాపు 16వేల ఓట్ల ఆధిక్యాన్ని దక్కించుకుంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో 54 వేల మెజారిటీ పొందిన బీఆర్ఎస్‌కు ఈసారి మాత్రం ఓట్లు తగ్గాయి. అదే విధంగా సిద్దిపేట నియోజకవర్గంలో చావుతప్పి కన్నులొట్టబోయినట్లు బీఆర్ఎస్‌కు స్వల్ప ఆధిక్యం లభించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో హరీశ్‌రావుకు 82వేల పైచిలుకు మెజారిటీ ఇచ్చారు. అయితే తాజా పార్లమెంటు ఎన్నికల్లో ఆ మెజారిటీ 2వేల పైచిలుకు ఓట్లకు పరిమితం కావడమే చర్చకు దారితీస్తున్నది. సిద్దిపేట పట్టణం మినహాయిస్తే చిన్నకోడూరు, నారాయణరావుపేట, నంగునూరు, సిద్దిపేట రూరల్ మండలాల్లో మాత్రం బీఆర్ఎస్ పైచేయి సాధించింది. సిద్దిపేట పట్టణంలోని పలువురు కౌన్సిలర్లు, స్థానిక ముఖ్య నేతలపై ఉన్న వ్యతిరేకతతోనే బీజేపీని ప్రజలు ఆదరించినట్లుగా చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యే హరీశ్‌రావుపై అభిమానం ఉన్నప్పటికీ, ఆయన విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ కొందరిపై ఉన్న అసంతృప్తితోనే ఓట్లు మళ్లినట్లుగా అభిప్రాయపడుతున్నారు. దీనికితోడు హిందుత్వవాదం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఆర్ఎస్ఎస్ వర్గాలు, ఆర్యవైశ్య సామాజికవర్గ ప్రచారం, రఘునందన్ వ్యక్తిగత సంబంధాలు తదితర అంశాలు ఎన్నికల్లో ప్రభావం చూపినట్లుగా భావిస్తున్నారు.

ఓటమిపై పోస్టుమార్టం

దారుణ ఓటమిని బీఆర్ఎస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఆ పార్టీకి ఎదురులేని ఈ లోక్‌సభ నియోజకవర్గంలో ఎదురుగాలి వీయడంపై డైలమాలో పడ్డారు. ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. ఓవైపు మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి, మరోవైపు మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నీతానై వ్యవహరించినా ఫలితాలు దెబ్బతీయడంపై తర్జనభర్జన పడుతున్నారు. అన్నింటికీ మించి మాజీ కలెక్టర్, ఈ ప్రాంతంతో సుపరిచితమైన వెంకట్రామారెడ్డి అభ్యర్థిగా ఉండడంతో కొత్త జోష్ సంతరించుకుంది. దీనికితోడు పీవీఆర్ ట్రస్టుతో రూ.100 కోట్ల విద్యానిధి, ఇతర సంక్షేమ కార్యక్రమాలు ఉచితంగా అందిస్తానని హామీలు ఇచ్చారు. ఇవి కూడా ఓటర్లను ఆకర్షించలేకపోయాయా? అని యోచిస్తున్నారు. క్షేత్రస్థాయిలో జరిగిన లోటుపాట్లు, ఇతర అంశాలపై పోస్టుమార్టం చేస్తున్నారు. కొన్నిచోట్లా నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం, పలువురిపై ప్రజల్లో వ్యతిరేకత ఉండడం, బీఆర్ఎస్‌ను ప్రత్యర్థులు తీవ్రంగా విమర్శించడం, పోల్ మేనేజ్‌మెంట్‌లోనూ తప్పిదాలు దొర్లడం తదితర అంశాలపై విశ్లేషణ జరుపుతున్నట్లుగా తెలుస్తోంది.

అసెంబ్లీకి నో.. పార్లమెంట్‌కు జై..

● బీజేపీపై హుస్నాబాద్ నియోజకవర్గ ఓటర్ల భిన్నవైఖరి

హుస్నాబాద్, జూన్ 5 : బీజేపీపై హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో దూరం పెడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో జై కొడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆదరించని ఇక్కడి జనం పార్లమెంట్ ఎన్నికల్లో అండగా ఉంటున్నారు. అందుకే కరీంనగర్ ఎంపీ సీటును రెండుమార్లు బీజేపీ కైవసం చేసుకున్నది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చాడ శ్రీనివాస్‌రెడ్డికి కేవలం 4,309 ఓట్లు వచ్చాయి. అప్పుడు 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి 43,144 ఓట్లు వచ్చాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బొమ్మ శ్రీరాంచక్రవర్తికి 8,228 ఓట్లు రాగా ప్రస్తుతం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి 55,873 ఓట్లు వచ్చాయి. ఇక్కడి ఓటర్ల ఆదరణతో రెండుసార్లు కరీంనగర్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ గెలుపొందారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అంతగా బలం లేని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం సత్తా చాటుతుంది. 1952 నుంచి జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎప్పుడూ కూడా ఇక్కడి ఓటర్లు బీజేపీని ఆదరించలేదు. నాటి నుంచి నేటి వరకు జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీని, కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిని ఆదరించారే తప్ప బీజేపీని ఎప్పుడూ అక్కున చేర్చుకోలేదు. గత రెండు పార్లమెంట్ ఎన్నికల నుంచి మాత్రం బీజేపీని ఆదరిస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఇక్కడ మొదటి స్థానంలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఈ ఎన్నికల్లో మూడవ స్థానానికి పరిమితమయ్యారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత నియోజకవర్గం కావడంతో కాంగ్రెస్ పార్టీ 23,128 ఓట్ల మెజారిటీ సాధించింది. అయితే ఇక్కడి ఓటర్లు బీజేపీని అసెంబ్లీ ఎన్నికల్లో దూరం పెడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం అక్కున చేర్చుకోవడం చర్చనీయాంశంగా మారింది.

అంతా ఉల్టా.. పల్టా!

చేర్యాల, జూన్ 5 : భువనగిరి లోక్‌సభ స్థానం ఎన్నికల ఫలితాల నేపథ్యంలో జనగామ నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం మారిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రె స్, బీఆర్ఎస్ మధ్య జరిగిన పోటీలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి 15,733ఓట్ల మెజారిటీ సాధించగా, పార్లమెంటు ఎన్నికలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ప్రధాన పోటీ సాగి బీఆర్ఎస్ చతికిలపడింది.

పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తంగా 1,81,302 ఓట్లు పోలవగా, కాంగ్రెస్‌కు 76,032, బీజేపీకి 44,797, బీఆర్ఎస్‌కు 43,844 ఓట్లు రావడంతో కాంగ్రెస్ 31వేలకుపైగా ఆధిక్యత కైవసం చేసుకుంది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో 2,03,205 ఓట్లు పోలవ్వడంతో బీఆర్ఎస్‌కు 98,557, కాంగ్రెస్‌కు 82,139, బీజేపీకి 7,595 ఓట్లు వచ్చాయి.

జనగామ నియోజకవర్గంలో అత్యంత కీలకమైన సిద్దిపేట జిల్లా పరిధిలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొన్నది. చేర్యాల పట్టణంలో 1,336, రూరల్‌లో 1,609, మద్దూరు మండలంలో 2,704, కొమురవెల్లి మండలంలో 978, ధూళిమిట్ట మండలంలో 2012ఓట్లు చొప్పున 8,639ఓట్లమేర సగానికిపైగా మెజారిటీని రాబట్టుకోగలిగారు.

భవిష్యత్‌పై పట్టు నిలుపుకున్న కొమ్మూరి

అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి పార్లమెంటు ఎన్నికలు అగ్నిపరీక్షగా మారడంతో మెజారిటీ సాధనకు తీవ్రంగా శ్రమించారు. నియోజకవర్గంలో తాను కోల్పోయిన ఓట్లకు రెండింతలు మెజారిటీ కాంగ్రెస్‌కు రాబట్టుకుని ఉనికి చాటుకున్నారు. భవిష్యత్ రాజకీయంపై పట్టు నిలుపుకున్నారు.

పనిచేయని దానంపల్లి సెంటిమెంట్

చేర్యాల నియోజకవర్గం జనగామలో విలీనమైన 2009 నుండి జరుగుతున్న ఎన్నికల్లో చేర్యాల మండలం దానంపల్లి నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. దీంతో ఆ గ్రామం ఎవరికి మద్దతునందించిందో వారే గెలుపు వాకిట నిలుస్తున్నారు. 2009లో పొన్నాల లక్ష్మయ్యకు, 2014, 2018లో ముత్తిరెడ్డి, 2023లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి దానంపల్లి నుంచే విజయపరంపర ప్రారంభమైంది. కానీ పార్లమెంటు ఎన్నికల్లో గ్రామంలో కాంగ్రెస్‌కు 269, బీజేపీ 182, బీఆర్ఎస్‌కు 323 ఓట్లు రావడంతో దానంపల్లి సెంటిమెంట్ పనిచేయలేదు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మంత్రి కొండాసురేఖ, నీలంమధు

మెదక్‌లో నైతిక విజయం కాంగ్రెస్‌దే

● బీఆర్ఎస్ మద్దతుతోనే బీజేపీ గెలుపు
● పార్టీ అండగా ఉంటుంది
● నీలం మధుకు భరోసా ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి

పటాన్‌చెరు/ పటాన్‌చెరు రూరల్, జూన్ 5: మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే నైతిక విజయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన నీలం మధు, కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో కలిసి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నీలం మధును సీఎం ఓదార్చారు. బెంగపడాల్సిన అవసరం లేదని సముదాయించారు. విజయం దగ్గర దాకా వచ్చి చేజారిందని, అంతమాత్రాన బాధపడాల్సిన పనిలేదన్నారు. మెదక్ లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు చేసిన తీవ్రమైన కృషిని సీఎం అభినందించారు. త్రుటిలో విజయం చేజారిందని, ఎవరూ అధైర్యపడకూడదన్నారు. నీలం మధుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రేవంత్‌రెడ్డి భరోసా కల్పించారు. ఓటమి తప్పదని గ్రహించిన బీఆర్ఎస్ శ్రేణులు బీజేపీకి ఓట్లు వేసి గెలిపించారని ఆరోపించారు. తనకు అండదండలు అందించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, జిల్లా కాంగ్రెస్ నాయకులకు నీలం మధు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు శక్తివంచనలేకుండా కృషి చేస్తానన్నారు.

దంచికొట్టిన వాన

● ఉమ్మడి మెదక్ జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం
● సిద్దిపేట జిల్లా అంగడికిష్టాపూర్‌లో 6.1 సెంటీమీటర్లు

మెదక్ అర్బన్, జూన్ 5: ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. బుధవారం మధ్యాహ్నం కమ్ముకున్న మేఘాలకు తోడు ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడింది. దాంతో వాతావరణం చల్లబడింది. సిద్దిపేట జిల్లా అంగడికిష్టాపూర్‌లో అత్యధికంగా 6.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా... రేంబర్తి 3.6 సెం.మీ., మెదక్ జిల్లా నాగాపూర్‌లో 3.3 సెం.మీ., లక్ష్మాపూర్‌లో 2.1 సెం.మీ., సంగారెడ్డి జిల్లా జిన్నారంలో 2 సెం.మీ., ఝరాసంగం 1.9 సెం.మీ., మెదక్ పాతూర్ 1.8 సెం.మీ., నారాయణఖేడ్ 1.4 సెం.మీ. వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాలు రాబోయే మూడు నాలుగు రోజుల్లో రాష్ట్రంలో ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ పేర్కొంది.

పిడుగుపాటుతో 9 మందికి గాయాలయ్యాయి. అందులో ఒకరు తీవ్రగాయపడ్డారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లిలో మధ్యాహ్నం పొలాల వద్ద పలువురు పనిచేస్తూ ఉండగా వర్షం ప్రారంభమైంది. కూలీలు పొలం గట్టుపై ఉన్న చెట్టు వద్దకు వెళ్లారు. ఒక్కసారిగా పెద్దశబ్దంతో వారు ఉన్న కొద్దిదూరంలో పిడుగు పడింది. గ్రామానికి చెందిన ఎండి బాబు నడుము నుంచి కింది భాగం వరకు గాయమైంది. ఎనిమిది మంది మహిళా కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. స్వల్పంగా గాయపడిన మహిళా కూలీలు తీవ్రంగా గాయపడిన బాబును వికారాబాద్ జిల్లా మర్పల్లిలోని ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ప్రశాంతంగా ఐసెట్

● రెండు సెంటర్లలో మొత్తం 47 మంది గైర్హాజరు



అభ్యర్థులను తనిఖీ చేసి సెంటర్‌లోకి పంపిస్తున్న సిబ్బంది

సిద్దిపేటక్రైం, జూన్ 5 : సిద్దిపేట జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన ఐసెట్ రెండు సెంటర్లలో ప్రశాంతంగా ముగిసింది. ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 100 మంది అభ్యర్థులకు ఆరుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 100 మందికి ఐదుగురు గైర్హాజరయ్యారు. వెరిటస్ అండ్ విరిటస్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సెంటర్‌లో ఉదయం 150 అభ్యర్థులకు 21 మంది, మధ్యాహ్నం 15 మంది గైర్హాజరయ్యారు. రెండు సెంటర్లలో కలిపి 47 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ మనుచౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 05: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం పరీక్షల అబ్జర్వర్లు, చీఫ్ సూపరింటెండెంట్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9న గ్రూప్-1 ప్రిలిమినరీ జిల్లాలోని 21 పరీక్ష కేంద్రాల్లో జరగనుందని చెప్పారు. మొత్తం 8,223 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్డి, ఫర్నీచర్, విద్యుత్ తదితర సౌకర్యాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా టీజీపీఎస్సీ ఆదేశాల ప్రకారం పరీక్ష నిర్వహణ రోజు నిర్ణీత సమయంలోనే పరీక్ష నిర్వహించాలన్నారు. పరీక్ష పూర్తయ్యే వరకు సెంటర్ల నుంచి ఎవరినీ బయటకు పంపకూడదని సూచించారు. హాల్‌టికెట్‌పై ఫొటో లేకపోయినా, పేరు తప్పుగా ఉన్నా అభ్యర్థుల నుంచి అఫిడవిట్‌ను తీసుకోవాలన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌లో వారి వివరాలను సరిగా రాశారో లేదో ఇన్విజిలేటర్ల ద్వారా చెక్ చేయించుకోవాలని తెలిపారు. అంధ, దివ్యాంగ అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు సహాయకులుగా ఇంటర్ లేదా ఆలోపు చదివిన వారికి మాత్రమే అవకాశం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, ఇందూరు కళాశాల ప్రిన్సిపాల్ రాజు, అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

నేటి నుంచి 'బడిబాట'

● షెడ్యూల్‌లో విద్యాశాఖ మార్పు
● 19 వరకు పలు కార్యక్రమాలు

సంగారెడ్డి అర్బన్/ మెదక్ అర్బన్, జూన్ 5 : సర్కారు బడుల్లో విద్యార్థులను చేర్పించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం ప్రారంభం కానున్నది. ఈనెల 3 నుంచి 19 వరకు బడిబాట నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. ఈ నెల 3 వ తేదీనే బడిబాట కార్యక్రమం ప్రారంభం కావాల్సి ఉండగా, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఉండడంతో అధికారులు వాయిదా వేశారు. బుధవారం ప్రభుత్వం కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది. బడిబాట కార్యక్రమంలో భాగంగా రోజు వారి విడుదల చేసిన షెడ్యూల్‌ను విద్యాశాఖ సమగ్ర శిక్ష అధికారులు మార్పు చేసి మార్గదర్శకాలు విడుదల చేశారు. ఈ నెల 6 న గ్రామ సమాఖ్య సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి బడిబాట కార్యక్రమ అమలుపై చర్చించనున్నారు. 7 న ఇంటింటి సర్వే చేసి పిల్లల వివరాలు నమోదు చేయనున్నారు. 8 నుంచి 10 వరకు ప్రత్యేకంగా రూపొందించిన ప్రచార బోర్డుతో ర్యాలీలు, ఇంటింటి ప్రచారం, ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, సర్కారు బడుల్లో కల్పిస్తున్న విద్యాబోధన, వసతులు తదితర వాటిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేయనున్నారు. 11న గ్రామ సభ నిర్వహించి బడిబాట ఫలితాలపై చర్చించనున్నారు. 12న పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్న నేపథ్యంలో పాఠశాలలను అందంగా ముస్తాబు చేసి పిల్లలు, తల్లిదండ్రులకు స్వాగతం పలకనున్నారు. 13న పిల్లలందరూ బడికి రావాలని కోరుతూ రూపొందించిన ఎఫ్ఎల్ఎన్(తొలి మెట్టు)పాటను వినిపించనున్నారు. 14న సామూహిక అక్షరాభ్యాసం, ఉన్నత పాఠశాలల్లో బాల సభ నిర్వహణ, 15 న గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్ డే, 18న డిజిటల్ విద్యా, మొక్కలు నాటే కార్యక్రమం, 19న స్పోర్ట్స్ డేతో బడిబాట షెడ్యూల్ ముగియనుంది.

ఫర్టిలైజర్ షాపులో తనిఖీలు.. కేసు నమోదు

అధిక ధరలకు పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్టు గుర్తింపు



తనిఖీలు చేస్తున్న అధికారులు

మునిపల్లి, జూన్ 5 : అధిక ధరలకు పత్తి విత్తనాలను విక్రయిస్తున్న విత్తన డీలర్‌పై అధికారులు కేసు నమోదు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల పరిధిలోని బుదేరా చౌరాస్తాలో ఉన్న పద్మావతి ఫర్టిలైజర్ షాపులో పత్తి విత్తనాలను ఎమ్మార్పీ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అధికారులకు విశ్వసనీయమైన సమాచారం అందింది. దీంతో, డీఏవో అంబికా సోని, ఏడీఏ శ్రీనివాస్‌ప్రసాద్, ఏవో శివకుమార్ బుధవారం ఆ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూజివీడు కంపెనీకి చెందిన ఆధ్య వెరైటీ యూఎస్ 7067 రకం పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. విచారణలో ఈ విషయాన్ని డీలర్ వెంకట్‌రావు ఒప్పుకున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో, దుకాణంలో నిల్వ ఉన్న రూ. 43,69,248 విలువైన విత్తనాల విక్రయాన్ని నిలిపివేశారు. అధిక ధరలకు విత్తనాలను విక్రయించిన డీలర్ వెంకట్‌రావుపై కేసు నమోదు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.



తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న నిఖిత

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

చిన్నశంకరంపేట, జూన్ 5: కన్నతండ్రికి ఓ కూతురు తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన దడువాయి పరమేశ్వర్ (35) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి భార్య శంకరమ్మ, ముగ్గురు కూతుళ్లు నిఖిత, వెన్నెల, రుచిత ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో పెద్ద కూతురు నిఖిత తండ్రికి తలకొరివి పెట్టింది.

మినీ బస్సు బోల్తా.. 15 మందికి గాయాలు

చేగుంట, జూన్ 5 : దైవ దర్శనం చేసుకుని తిరిగివస్తున్న భక్తుల బృందం రోడ్డు ప్రమాదంలో గాయపడింది. మెదక్ జిల్లా నర్సింగి మండలం వల్లూరు గ్రామ శివారులో 44వ జాతీరహదారిపై మినీ బస్సు బోల్తాపడిన ఘటనలో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి, హైదరాబాద్‌కు చెందిన మిత్రులు, బంధువులు మొత్తం 21 మంది కాశీ, అయోధ్య యాత్రలకు మే నెల 24న హైదరాబాద్ నుంచి రైలులో బయలుదేరి వెళ్లారు. పది రోజుల పాటు వివిధ క్షేత్రాలను దర్శించుకున్న అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. రైలు టికెట్లు దొరక్కపోవడంతో లక్నో నుంచి మినీ బస్సును అద్దెకు తీసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. నార్సింగి గ్రామ శివారులోని ఓ హోటల్‌లో టిఫిన్ చేసిన అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరారు. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడంతో వల్లూరు గ్రామ శివారులోకి రాగానే రోడ్డు పక్కన డీకొని మినీ బస్సు బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న 15 మందికి గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. ప్రమాదంలో గాయపడిన జ్యోతి, పూర్ణ, ఉమ, రాధిక, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, నిర్మల, రమణ తదితరులను అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం 30 నిమిషాలకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న మినీ బస్సును పోలీసులు క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అహ్మద్ మొయినుద్దీన్ తెలిపారు.



ప్రమాదంలో గాయపడిన భక్తుల బృందం

నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ హవా

నారాయణఖేడ్, జూన్ 5: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కాంగ్రెస్ హవా కొనసాగింది. నారాయణఖేడ్ మండలంలో కాంగ్రెస్‌కు 6,421 ఓట్ల ఆధిక్యత లభించింది. మండలంలో బీఆర్ఎస్‌కు 7,930, బీజేపీకి 15,695, కాంగ్రెస్‌కు 22,116 ఓట్లు వచ్చాయి. నాగల్‌గిద్ద మండలంలో కాంగ్రెస్‌కు 1,424 ఓట్ల ఆధిక్యత లభించింది. బీఆర్ఎస్‌కు 1,740, బీజేపీకి 6,963, కాంగ్రెస్‌కు 8,383 ఓట్లు వచ్చాయి. మనూరులో కాంగ్రెస్‌కు 2,961 ఓట్ల మెజారిటీ వచ్చింది. బీఆర్ఎస్‌కు 3,172, బీజేపీకి 5,670, కాంగ్రెస్‌కు 8,639 ఓట్లు వచ్చాయి. కంగ్టి మండలంలో కాంగ్రెస్‌కు 1,955 ఓట్ల ఆధిక్యత లభించగా, బీఆర్ఎస్‌కు 3,583, బీజేపీకి 9358 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 11,353 ఓట్లు వచ్చాయి. కల్హేర్ మండలంలో 1,814 ఓట్లు కాంగ్రెస్‌కు ఆధిక్యత లభించగా, బీఆర్ఎస్‌కు 4,727 ఓట్లు రాగా, బీజేపీకి 6,837 ఓట్లు, కాంగ్రెస్‌కు 8,651 ఓట్లు వచ్చాయి. సిర్గాపూర్ మండలంలో కాంగ్రెస్‌కు 1,565 ఓట్లు ఆధిక్యత లభించింది. బీఆర్ఎస్‌కు 2,903, బీజేపీకి 6,072, కాంగ్రెస్‌కు 7,637 ఓట్లు వచ్చాయి. పెద్దశంకరంపేట మండలంలో కాంగ్రెస్‌కు 4,082 ఓట్ల ఆధిక్యత లభించింది. బీఆర్ఎస్‌కు 4,594 ఓట్లు రాగా, బీజేపీకి 7,415 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 11,497 ఓట్లు వచ్చాయి. మొత్తంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు 20,262 ఓట్ల ఆధిక్యత లభించింది. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డికి 91,373 ఓట్లు.. బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డికి 84,826 వచ్చాయి. బీజేపీకి 7,823 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం.

మున్సిపాలిటీలోనూ కాంగ్రెస్‌దే ఆధిక్యం

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో సైతం కాంగ్రెస్ ఆధిక్యత సాధించింది. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ ఆధిక్యత స్వల్పంగా తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 5,590, బీఆర్ఎస్ 4,432 ఓట్లు సాధించగా బీజేపీకి 453 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ 1,158 ఓట్ల ఆధిక్యాన్ని సాధించింది. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ 5,394, బీజేపీ 4,454, బీఆర్ఎస్ 593 ఓట్లు సాధించాయి.

పారిశ్రామికవాడ మొగ్గు బీజేపీ వైపే...

- మూడో స్థానానికి పరిమితమైన బీఆర్ఎస్
- ఆత్మపరిశీలనలో నాయకులు
- బీజేపీ క్యాడర్‌లో నూతనోత్సాహం

పటాన్‌చెరు, జూన్ 5: పటాన్‌చెరు పారిశ్రామికవాడ ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకే బ్రహ్మరథం పట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్‌కు ఎదురుగాలి వీచింది. ఓటర్ల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత ఎదురవుతున్న విషయం గమనించి, పరిస్థితిని చక్కదిద్దేందుకు ఎమ్మెల్యే, నాయకులు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. శాసనసభ ఎన్నికల్లో నామమాత్రంగా నిలిచిన బీజేపీకి.. లోక్‌సభ ఎన్నికల్లో లభించిన ఓట్లు చూసి బీఆర్ఎస్ క్యాడర్ ఖంగుతిన్నది. నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థికి 1,03,775 ఓట్లు లభించగా, కాంగ్రెస్ అభ్యర్థికి 94,294 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థికి కేవలం 54,581 ఓట్లు మాత్రమే రావడం ఆ పార్టీ నాయకులకు మింగుడు పడటం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 1,05,387 ఓట్లు రాగా.. కాంగ్రెస్‌కు 98,296 ఓట్లు, బీజేపీకి కేవలం 19,600 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆరు నెలల్లోనే పారిశ్రామిక వాడ ఓటరు పూర్తిగా బీజేపీ వైపు మొగ్గు చూపడం గమనార్హం. పార్టీకి పట్టుందని భావిస్తున్న పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, బొల్లారం తదితర ప్రాంతాల్లో ఓటర్లు బీజేపీకి పట్టం కట్టగా.. బీఆర్ఎస్ తృతీయ స్థానానికి పడిపోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరిస్థితి ఎలా ఉంటుందో అని క్యాడర్ అంతర్మథనంలో పడిపోయింది. మరోవైపు పార్లమెంటు ఎన్నికల ఫలితాలతో బీజేపీ క్యాడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొన్నది. మెదక్ ఎంపీ సీటు గెలవడంతో పాటు కేంద్రంలో మోదీ సర్కార్ రావడంతో సంబరాలు చేసుకున్నారు. సెగ్మెంట్‌లో మరింత బలపడి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుతామని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

నర్సాపూర్ బీజేపీలో బయటపడిన లుకలుకలు




వేర్వేరు ప్రెస్‌మీట్లలో మాట్లాడుతున్న నర్సాపూర్ బీజేపీ నాయకులు

నర్సాపూర్, జూన్ 5: నర్సాపూర్ నియోజకవర్గంలో బీజేపీలో నెలకొన్న అంతర్గత విభేదాలు ఎంపీ ఎన్నికల అనంతరం బయటపడ్డాయి. మెదక్ ఎంపీగా గెలిచిన బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును అభినందిస్తూ బీజేపీ ముఖ్య నాయకులు విడివిడిగా ప్రెస్‌మీట్లు పెట్టడం చర్చనీయంగా మారింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రమణారావు, కౌన్సిలర్లు రాజేందర్, సురేష్, యాదగిరి, బుచ్చేస్‌యాదవ్ తదితరులు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి బీజేపీకి ఓటేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు సీనియర్ నాయకుడు, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి, మాజీ అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అరవింద్‌గౌడ్ తదితరులు విడిగా ప్రెస్‌మీట్ పెట్టారు. దీంతో, పార్టీలో అంతర్గతంగా ముసుకున్న విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి.



ఎమ్ఎస్ అగర్వాల్ పరిశ్రమ ఆవరణలో మొక్కను నాటుతున్న మెదక్ ఎస్పీ బాలస్వామి

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

- మెదక్ ఎస్పీ బాలస్వామి

మనోహరాబాద్, జూన్ 5: పర్యావరణాన్ని పరిరక్షించాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మెదక్ ఎస్పీ బాలస్వామి పేర్కొన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయపల్లి, చెట్లగౌరారం గ్రామ శివార్లలోని ఎమ్ఎస్ అగర్వాల్ ఫౌండరీస్ పరిశ్రమలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరిశ్రమ ఆవరణలో మొక్కను నాటి నీళ్లు పోశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తనవంతు బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. పర్యావరణం బాగుంటేనే భవిష్యత్తు బాగుంటుందని చప్పారు. పరిశ్రమ యాజమని ప్రమోద్ అగర్వాల్, డైరెక్టర్ నరసింహ మాట్లాడుతూ ఈ సంవత్సరం పరిశ్రమ ఆధ్వర్యంలో సుమారు 5వేల మొక్కలు నాటడానికి ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. పర్యావరణ దినోత్సవం రోజున పరిశ్రమ ఆవరణలో 500 మొక్కలు నాటుతున్నట్టు తెలిపారు. ప్రతీ సంవత్సరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వసంత్ కూమార్, వెంకట్, సీఐ కృష్ణ, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



అరెస్టు చేసినవారిని చూపుతున్న పోలీసులు

భూ ఆక్రమణకు పాల్పడిన ముఠా అరెస్టు

- పది మంది రిమాండ్‌కు తరలింపు

సంగారెడ్డి టౌన్, జూన్ 5: విలువైన భూమిని కాజేసేందుకు ప్రయత్నించడంతో పాటు భూ యాజమానిని, అక్కడ పనిచేసే కూలీలను భయభ్రాంతులకు గురిచేసిన ముఠాను అరెస్ట్ చేసినట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేసు వివరాలను వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం.. హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన అత్రియా ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్ అయిన మంతెన రామకృష్ణ శ్రీనివాస్‌వర్మ (ఎంఆర్ఎస్ వర్మ), అదే ప్రాంతానికి చెందిన పెండ్యాల హరినాథ్‌బాబుకు మునిపల్లి మండలంలో 100 ఎకరాల భూమిని ఇప్పిస్తానని, దానిని తానే డెవలప్‌మెంట్ కూడా చేస్తానని ఎంవోయూ చేసుకుని రూ. 30 కోట్లు తీసుకున్నాడు. అనంతరం పెండ్యాల హరినాథ్ బాబుకు 70 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాడు. ఇందులో 10 ఎకరాలు డబుల్ రిజిస్ట్రేషన్. దీంతో తనకు పది ఎకరాల భూమి ఇవ్వాలని హరినాథ్‌బాబు వర్మను పదేపదే అడిగాడు. దీంతో ఆగ్రహం చెందిన వర్మ తన వద్ద పనిచేస్తున్న గణపతి రాజు (శ్రవణ్), గట్టుముక్కల భారత్‌వర్మ, పి.అశోక్‌రెడ్డి, పాషాలకు విషయం చెప్పాడు. వారు అఖిల్ అనే వ్యక్తిని సంప్రదించారు. దీంతో వీరంతా మే 26న మునిపల్లి మండలం ఖమ్మంపల్లి గ్రామ పరిధిలో పెండ్యాల హరినాథ్‌కు చెందిన సర్వే నంబర్ 198, 251లోని భూమిలోకి కిరాయిరౌడీలతో కలిసి అక్రమంగా ప్రవేశించారు. తల్వార్, కత్తులు, కర్రలతో అక్కడ పనిచేస్తున్న వారిపై దాడి చేసి చంపుతామని బెదిరించి వెళ్లగొట్టారు. ఎక్స్‌కవేటర్ల సహాయంతో భూమి చుట్టూ వేసిన 800 ఫెన్సింగ్ కడ్డీలను విరగొట్టారు. ఈ దాడిలో గాయపడిన గాడిపర్తి రవీందర్‌బాబు అనే వ్యక్తి మునిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంపై కేసు నమోదు చేశారు. సంగారెడ్డి డీఎస్పీ, మునిపల్లి, కొండాపూర్ సీఐలు దర్యాప్తు చేపట్టి 17 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పది మందిని అరెస్ట్ చేసి, కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు.

టీఎఫ్‌డీసీ చైర్మన్ గిరిధర్‌రెడ్డికి 'ఆటా' ఆహ్వానం



గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్, జూన్ 5 : అమెరికాలోని తెలుగు సంఘం వారు నిర్వహిస్తున్న 18వ ఆటా(అట్లాంట) మహాసభలకు తెలంగాణకు చెందిన రాష్ట్ర ఫిలిండెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ విషయాన్ని ఆయన బుధవారం తెలియజేశారు. అమెరికాలోని జార్జియా వరల్డ్ కాంగ్రెస్ సెంటర్‌లో జూన్ 7, 8, 9న నిర్వహిస్తున్న తెలుగు సంఘం మహాసభలకు ఆ సంఘం అధ్యక్షుడు మధు బొమ్మినేని తనను ఆహ్వానించారని తెలిపారు. ప్రతీ రెండేళ్లకోసారి నిర్వహించే సభలకు తెలంగాణ నుంచి ప్రముఖులను ఆహ్వానిస్తారని తెలిపారు. ఈ ఏడాది తనకు అవకాశం రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అదనపు కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఆవరణలో మొక్క నాటి నీరు పడుతున్న గరిమా అగ్రవాల్



సిద్దిపేట రూరల్: ఉపాధి కూలీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీవో దేవకీదేవి, అడిషనల్ డీఆర్డీవో బాలకృష్ణ



గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



జిల్లా కేంద్రంలో పర్యావరణ పరిరక్షణ ర్యాలీలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణలో, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొని అడవుల పెంపకం, పచ్చదనం ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సిద్దిపేట టౌన్/కొండపాక, జూన్ 5: భావితరాల కోసం పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఆమె హరితహారం అధికారి ఐలయ్యతో కలిసి కొండపాక మండల పరిధి దుద్దెడ శివారులోని అదనపు కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రోడ్లకిరు వైపులా, పొలాల గట్లపై, ప్రభుత్వ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పుట్టినరోజు, పెళ్లి రోజుల్లో మొక్కలు నాటి సమాజహితంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి చక్రపాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **సిద్దిపేట టౌన్:** సిద్దిపేట పట్టణంలోని క్రాంతి పాఠశాల, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్లాష్ మాబ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ముస్తాబాద్ చౌరస్తా, కాంచిట్ చౌరస్తా, పాత బస్టాండ్, బ్లాక్ ఆఫీస్ చౌరస్తాలో విద్యార్థులు నృత్య ప్రదర్శన ద్వారా పర్యావరణంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● **సిద్దిపేట క్రైం:** ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణ నుంచి విక్టరీ టాకీస్ చౌరస్తా వరకు జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి రమాదేవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ- ప్రకృతిని ప్రేమిస్తూ పర్యావరణాన్ని రక్షించుకుందామని పిలుపునిచ్చారు. పట్టణంలోని క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● **సిద్దిపేట రూరల్:** సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి, చింతమడక గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ కాలుష్యాన్ని నియంత్రించేందుకు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో దేవకీదేవి, ఏపీడీ శివాజీ, డీఎల్‌పీవో ప్రభాకర్, ఎంపీడీవో రాఘవేందర్ రెడ్డి, ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● **గజ్వేల్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ సాయికిరణ్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బందితో కలసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని, జలాలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేపట్టిన ర్యాలీని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇందిరాపార్కు చౌరస్తా నుంచి నినాదాలు చేస్తూ రోడ్లపై గల చెత్తను తొలగించారు. వారితో ఎన్‌సీసీ ఆఫీసర్ భవానీ తదితరులున్నారు.

● **కొండపాక:** పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొండపాకలో ఎంపీపీ మంచాల అనసూయ కనకరాములు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి, పచ్చదనాన్ని పెంచాలని పిలుపునిచ్చారు.

● **కుకునూరుపల్లి:** మండలంలోని అన్ని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ కూలీలు మొక్కలను నాటారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు.

● **మద్దూరు:** మద్దూరు మండలంలోని సలాఖ్‌పూర్. మర్మాముల, రేబర్తి గ్రామాల్లో పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. రేబర్తి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సెక్రటరీ మాదవ్ జాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీడీవో ఎస్. రాంమోహన్ హాజరై మాట్లాడారు.

పనులు చేస్తూ ఉపాధి కూలీ మృతి



అనిత (ఫైల్)

దౌల్తాబాద్, జూన్ 5: ఉపాధి హామీ పనులు చేస్తూ ఓ మహిళా కూలీ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చెట్ల నర్సంపల్లి గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకున్నది. ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం- దౌల్తాబాద్ మండలంలోని చెట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన పసుల స్వామి, భార్య అనిత వ్యవసాయంతో పాటు ఉపాధి పనులు కూడా చేస్తుంది. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం ఆమె గ్రామ శివారులో చిన్న కుచ్చదుబ్బ అడవిలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా మొక్కలు నాటేందుకు వెళ్లింది. పని చేస్తూ గుంతలో మట్టి తీస్తున్న క్రమంలో ఆకస్మాత్తుగా కిందపడింది. అక్కడే ఉన్న మరో కూలీతో పాటు ఇతర కూలీలు వచ్చి అనితను గ్రామంలోని ఓ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

సిద్దిపేట అర్బన్, జూన్ 5 : సిద్దిపేట పట్టణం మైత్రీవనం సమీపంలోని హైదరాబాద్ రోడ్డు ఫస్ట్ ఫ్లోర్‌లోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మైత్రీవనం సమీపంలోని ఒక ఇంటిలో సంద కవిత అనే మహిళ ఇతర యువతులను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్టు పోలీసులకు సమాచారమందింది. విశ్వసనీయ సమాచారం మేరకే దాడి చేసినట్టు పోలీసులు తెలిపారు. అదే సమయంలో సంకోజీ మహేష్ అనే వ్యక్తితో పాటు వ్యభిచార గృహ నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 1,470, కండోమ్స్ ప్యాకెట్ మూడు, సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు వివరించారు.

టైరు పేలి బోల్తా పడిన ఆటో.. ఇద్దరికి గాయాలు



బొల్తాపడిన ఆటో

కుకునూరుపల్లి, జూన్ 5: చేపల లోడుతో ప్రయాణిస్తున్న ఆటో టైరు పేలడంతో బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి లకుడారం గ్రామంలో రాజీవ్ రహదారిపై చోటుచేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కట్కూరు గ్రామం నుంచి చేపల లోడుతో హైదరాబాద్‌కు వెళ్తున్న ఆటో లకుడారం గ్రామ శివారులోకి రాగానే ఒక్కసారిగా టైరు పేలడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌ని ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ అజయ్ చేయి విరిగింది. పక్కనే ఉన్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారమందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అనంతరం వారిద్దరిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గజ్వేల్‌లో రూ.1.20లక్షల విలువైన గుట్కా పట్టివేత

గజ్వేల్, జూన్ 5: గజ్వేల్ పట్టణంలో నిషేధిత గుట్కాలను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గజ్వేల్ పట్టణానికి చెందిన గార్గ్ సచిన్ అగర్వాల్, ఇమ్మడి రవికుమార్ గజ్వేల్ పట్టణంలోని వారి దుకాణాల్లో ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు, బ్లాక్ సిగిరేట్లను విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారమందడంతో దాడులు నిర్వహించారు. రూ.1.20 లక్షల విలువ చేసే గుట్కా, బ్లాక్ సిగిరేట్స్‌ను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్టు గజ్వేల్ పోలీసులు తెలిపారు.

మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించిన పోలీసులు

సిద్దిపేట రూరల్, జూన్ 5: పోగొట్టుకున్న మూడు మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి బుధవారం బాధితులకు అందజేసినట్టు సిద్దిపేట రూరల్ ఎస్ఐ గూడ అపూర్వరెడ్డి తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ నెల రోజుల క్రితం సిద్దిపేటకు చెందిన మస్కూరి స్వప్న, మార్చి నెలలో చింతమడక గ్రామానికి చెందిన అరుణ్‌రెడ్డి, బచ్చాయిపల్లి గ్రామానికి అర్జున్ తమ విలువైన సెల్‌ఫోన్లను పొగొట్టుకోగా, సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను గుర్తించి వారికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

● రాయపోల్, జూన్ 5: రాయపోల్ గ్రామానికి చెందిన దయ్యాల నరేష్ మూడు నెలల క్రితం వడ్డేపల్లి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. రాయపోల్ పోలీసులను ఆశ్రయించగా సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా సెల్‌ఫోన్ రికవరీ చేశారు. బుధవారం ఎస్ఐ రఘుపతి బాధితుడికి సెల్‌ఫోన్‌ను అందజేశారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి:సీఐ

గజ్వేల్, జూన్ 5: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటించాలని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఆయా చౌరస్తాలలో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని తేలిపోయింది



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు అత్తుఇమామ్

సిద్దిపేట టౌన్, జూన్ 5: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పెరిగిందని ఆ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ తెలిపారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అత్తు ఇమామ్ మాట్లాడుతూ.. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, అందులో ఆరు అసెంబ్లీ సీట్లను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకున్నప్పటికీ పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ వైపు ప్రజలు మొగ్గుచూపలేదని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ఓట్లన్నీ బీజేపీకి పడ్డాయని, అందువల్లే బీజేపీ అభ్యర్థి గెలుపొందారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలతో బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని స్పష్టంగా తేలిపోయిందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికల వరకు నిర్విరామంగా కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు పాదాభివందనం చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కూడా కసరత్తు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో నాయకులు గ్యాదరి మధు, మజర్ మాలిక్, గయాజుద్దీన్, రాశద్, నజ్జు, అయూబ్, ఫయాజ్, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

● ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి నాచారం శేఖర్

గజ్వేల్, జూన్ 5: ప్రైవేటు, కార్పొరేట్ వ్యవస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి నాచారం శేఖర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏటా పుట్టగొడుగుల్లా కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టుకొచ్చి, రూ. లక్షల ఫీజులతో విద్యను వ్యాపారం చేస్తున్నాయని మండిపడ్డారు. జిల్లాలో అనుమతి లేని పాఠశాలలు చాలా నడుస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారని మండిపడ్డారు. సమావేశంలోఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌పార్టీకి అండగా హుస్నాబాద్ ప్రజలు

● జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి

హుస్నాబాద్, జూన్ 5: ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి అండగా ఉండటం అభినందనీయమని జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన హుస్నాబాద్‌లోని రిటైర్డు ఉద్యోగుల సంఘం భవనంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అప్రజాస్వామికంగా బీజేపీకి సహకరించడం అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో నిర్వీర్యం చేయడమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ తొత్తుగా మారడం యావత్ రాష్ట్ర ప్రజలు గమనించారన్నారు. కరీంనగర్ పార్లమెంట్‌లోని హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జేఏసీ కో ఆర్డినేటర్లు మేకల వీరన్న యాదవ్, ప్రొఫెసర్ వీరన్ననాయక్, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, జయపాల్‌రెడ్డి, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన అహ్మదీపూర్ విద్యార్థిని



అభిజ్ఞ

గజ్వేల్, జూన్ 5: గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన పల్లిపాటి అభిజ్ఞ నీట్-2024 ఫలితాల్లో సత్తా చాటింది. అహ్మదీపూర్‌కు చెందిన పల్లిపాటి రాంచంద్రం-శారదల కుమార్తె పల్లిపాటి అభిజ్ఞ మంగళవారం విడుదలైన నీట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 4443(క్యాట్) సాధించి సత్తా చాటారు. మొత్తం 720 మార్కులకు గానూ 573 మార్కులను సాధించి, జాతీయ స్థాయిలో ర్యాంకును సాధించారు. ఈ సందర్భంగా గీతాంజలి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వి.మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి అభిజ్ఞకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

కుకునూరుపల్లి, జూన్ 5: మండల పరిధిలోని బొబ్బాయిపల్లి గ్రామంలో ఉమ్మడి కొండపాక మండల ఎంపీడీవో వెంకటేశ్వర్లు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా బొబ్బాయిపల్లి గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులతో పాటు హరితహారం పనులను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు.

ప్రభుత్వ కళాశాలలో ఉత్తమ బోధన

● ప్రిన్సిపాల్ సురేష్‌రెడ్డి

దౌల్తాబాద్, జూన్ 5: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్లు పొంది ఉత్తమ ఫలితాలు సాధించాలని దౌల్తాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి ఉప్పరపల్లి, కోనాపల్లి, గువ్వలేగి, పోసాన్‌పల్లి, బోనాల తదితర గ్రామాల్లో దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు, తల్లి దండ్రులకు కళాశాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రచారం చేశారు. కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకోవాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపబృందం మంగ్యనాయక్, దాకర్, సంపత్, శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్, నాగేశ్వర్ రావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

సిద్దిపేట అర్బన్, జూన్ 5 : కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనుమతి లేని పాఠశాలల పై డీఈవో తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాలో పలు విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పాఠ్య పుస్తకాలు, టై, బెల్ట్, షూ, యూనిఫాంలు అమ్ముతూ అడ్డుగోలుగా అడ్మిషన్లు చేస్తున్నారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా డీఈవో చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విచ్చలవిడిగా ఫీజుల పెంచాయని, వీటి నియంత్రణ కోసం తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్రంలో బడి బాట కార్యక్రమం మొదలు పెట్టాలని, శిథిలావస్థలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి నిధులేవీ?

మర్కూక్ సర్వసభ్య మండల సమావేశంలో సభ్యుల అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పాండుగౌడ్

మర్కుక్, జూన్ 5: నిధులు లేక గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని ఎంపీటీసీలు అసహనం వ్యక్తం చేశారు. మర్కుక్ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ పాండుగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలను సభకు వివరించారు. సమావేశంలో ఎంపీటీసీలు మాట్లాడుతూ గ్రామాలలో చెరువులు నింపడంలేదని ప్రత్యేక అధికారుల పనితీరు మెరుగుపడాలని, గ్రామాల్లో ఇంతవరకు జరిగిన అభివృద్ధి పనులను ఇకనైనా నిధులు చెల్లించాలని సభ దృష్టికి తెచ్చారు. అనంతరం ఎంపీపీ పాండుగౌడ్ మాట్లాడుతూ కొండపోచమ్మ రిజర్వాయర్‌లో నీరు రావడంలేదని, రిజర్వాయర్‌లోకి నీరు విడుదల కాగానే కచ్చితంగా మండలంలోని అన్ని చెరువులు నింపుతామని ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. గ్రామాలలో ప్రత్యేకాధికారులతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఎంపీటీసీలే బాధ్యత వహించాలన్నారు. మండలానికి నూతనంగా ఆపరేషన్ మెయింటనెన్స్ కింద రూ.10.50లక్షలు, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.9.8లక్షల నిధులు వచ్చాయని ఎంపీపీ వివరించారు. అధికారులు సమన్వయంతో ఈ పనులను పూర్తి చేయాలని, మండలంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీడీవో అబ్దులుద్దీన్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఎంపీటీసీలు నరేందర్, ధనలక్ష్మీకృష్ణ, తుమ్మ బాల్‌నర్సవ్వ, మర్కుక్ ఏవో డాక్టర్ నాగేందర్‌రెడ్డి, ఎంఈవో ఉదయబాస్కర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యరేఖ, ఎంపీవో రాజలింగం, డాక్టర్ దీప, విద్యుత్ శాఖ ఏఈ సుదీర్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జబోరారాణి, ఆర్ఐ నర్సింహులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్



గౌరారంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్

వర్గల్, జూన్ 5: పిల్లలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గౌరారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌సీ, పీఎన్‌సీ గర్భవతులు, తల్లులు, పిల్లలకు పాలు, బాలామృతంను సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. అదే విధంగా ప్రజలందరు పరిశుభ్రతను పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలన్నారు. హెచ్‌బీఎన్‌సీ కిట్ల ప్రాముఖ్యతను తెలియజేస్తూ తగు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ డేనియల్, డాక్టర్ మహతీ, ఎంఎల్‌హెచ్‌పీ మాణిక్యమ్మ, ఏఎన్ఎం శ్రావణి, లత, ఆశా వర్కర్లు సంతోష, అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రంలో సరఫరా చేసిన నాసిరకం కోడిగుడ్లు

చేర్యాల, జూన్ 5: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం బలవర్ధకమైన కోడి గుడ్లను ప్రభుత్వం అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణా లోపం, కాంట్రాక్టర్ల కక్కుర్తి కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలకు కొన్నాళ్లుగా చిన్నసైజు పరిమాణం గల కోడిగుడ్లనే కాకుండా కుళ్లిన గుడ్లను కూడా సరఫరా చేయడంపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే- కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఇటీవల కాంట్రాక్టర్ సరఫరా చేసిన కోడిగుడ్లను బుధవా రం అంగన్‌వాడీకేంద్రంలో లబ్ధిదారులకు అందజేశారు. తీరా ఇంటికి వెళ్లి చూసేసరికి అనుమానం రావడంతో కోడిగుడ్లను పరిశీలించగా, కుళ్లిపోవడంతో పాటు దుర్వాసన వెదజల్లడంతో ఆందోళనకు గురయ్యారు. కుళ్లిపోయిన కోడిగుడ్లు ఇచ్చారేంటని అంగన్‌వాడీ టీచర్లను ప్రశ్నించగా, కేంద్రానికి వచ్చిన గుడ్లనే తాము పంపిణీ చేశామని చెప్పడంతో చేసేదేమీలేక గుడ్లను ఆరుబయట పారబోశారు. కాంట్రాక్టర్ నాసిరకం గుడ్లను సరఫరా చేస్తున్నాడా...లేదా నెలలో ఒకేరోజున గుడ్లు ఇస్తుండటంతో అంగన్‌వాడీ కేంద్రంలో నిల్వ చేయడంతో దెబ్బతింటున్నాయా అనే విషయాన్ని సంబంధిత అధికారులు గుర్తించి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. కాగా కుళ్లిన గుడ్లను పంపిణీ చేసిన విషయాన్ని సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. ఈ విషయమై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పావనిని వివరణ కోరగా కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ విషయం తమ దృష్టికి రావడంతో వాటిని వాపస్ తీసుకుని నాణ్యమైన కోడిగుడ్లు అందించాలని అంగన్‌వాడీ టీచర్‌కు చెప్పామన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నాసిరకం గుడ్లు పంపిణీ కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పతనం సిద్దిపేట నుంచే ప్రారంభం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి



హుస్నాబాద్‌లో బీజేపీ విజయోత్సవ ర్యాలీ

సిద్దిపేట క్రైం, జూన్ 5: బీఆర్ఎస్ కంచుకోట అయిన సిద్దిపేట నుంచే ఆ పార్టీ పతనం ప్రారంభమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా రఘునందన్ రావును గెలిపించిన జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రజలను డబ్బులతో, మద్యంతో ప్రలోభాలకు గురి చేసినా బీజేపీ గెలుపును అడ్డుకోలేకపోయాయని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. అనంతరం నాయకులు స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వంగ రామచంద్రారెడ్డి, విద్యాసాగర్ రావు, బాసంగారి వెంకట్, అసెంబ్లీ కన్వీనర్ ఉపేందర్ రావ్, బీజేపీ నాయకులు, కొత్తపల్లి వేణు, శ్రీను, మార్కండేయులు పాల్గొన్నారు.

● **జగదేవ్‌పూర్:** బీజేపీ మెదక్ అభ్యర్థిగా గెలుపొందిన రఘునందన్‌రావును బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం శ్రీధర్. ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నెపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రఘునందన్‌రావు మాట్లాడుతూ మెదక్‌లో పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ కార్యకర్తకు, ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని కలిసినవారిలో కొట్టాల మల్లేష్, కొంతం సుధాకర్, చంద్రశేఖర్ రెడ్డి, సురేష్, కరుణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మొక్కు తీర్చుకున్న అభిమానులు

సిద్దిపేట అర్బన్, జూన్ 5: రఘునందన్ రావు గెలుపొందడం పట్ల సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లి గ్రామంలో బుధవారం అభిమానులు సంబరాలను జరుపుకున్నారు. గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో ఉపవాస దీక్షతో కార్యకర్తలు స్థానిక ఆలయంలో నూట ఒక కొబ్బరికాయలను కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దుబ్బాక వెంకటేష్‌గౌడ్, సాంబశివారెడ్డి, సాయి, శ్రీనివాస్, వెంకటేష్, భానుప్రసాద్, సాయి, ప్రవీణ్, గున్నల రవి ఉన్నారు.

హుస్నాబాద్‌లో విజయోత్సవ ర్యాలీ

హుస్నాబాద్ టౌన్, జూన్ 5: కరీంనగర్‌గా ఎంపీగా బండి సంజయ్ గెలుపొందడంపై బుధవారం పట్టణంలో బీజేపీ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లక్కిరెడ్డి తిరుమల, పట్టణ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ జిల్లా అధికారి సూర్య ప్రకాష్ రావు

అధ్యాపకుల చేతుల్లో విద్యార్థుల భవిష్యత్తు

● జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సూర్య ప్రకాష్‌రావు

సిద్దిపేట క్రైం, జూన్ 5: విద్యార్థుల భవిష్యత్తు అధ్యాపకుల చేతుల్లో ఉందని పొరపాట్లు లేకుండా మూల్యాంకనం చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రం అధికారి, జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంలో అధ్యాపకులకు మూల్యాంకనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో మార్కు విద్యార్థులకు ఎంతో విలువైందన్నారు. జవాబులను క్షుణ్ణంగా చదివి తగిన మార్కులను కేటాయించాలని సూచించారు. నిర్లక్ష్యంగా ఒకరిద్దరు చేసే పొరపాట్లకు మొత్తం ఇంటర్ బోర్డునే తప్పు పట్టే పరిస్థితులు ఉత్పన్నమవుతాన్నారు. సమయపాలన పాటించి ఏకాగ్రతతో మూల్యాంకనం చేయాలని సూచించారు. చీఫ్ కోడింగ్ అధికారి శ్రీనివాస్, క్యాంపు జనరల్-1 అధికారి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గతంలో జరిగిన పొరపాట్లను వివరిస్తూ, ప్రస్తుతం అలాంటివి జరగకుండా ఉండేందుకు అనుసరించాల్సిన పద్ధతులను గూర్చి వివరించారు. ఎగ్జామినర్ల సెల్‌ఫోన్లను చీఫ్ ఎగ్జామినర్లు తమ దగ్గర ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్యాంపు జనరల్-2 అధికారి అమరేందర్ రెడ్డి, ఏసీవోలు మంగరాజు, రామచంద్రారెడ్డి, దేవస్వామి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నాగపురి



సీఎంకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న కిరణ్‌కుమార్

చేర్యాల, జూన్ 5 : భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్ రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందిన నేపథ్యంలో చేర్యాల పట్టణానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రనాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ బుధవారం హైదరాబాదులో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. అంతకుముందు కిరణ్‌కుమార్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసారు.

మంత్రి పొన్నంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, జూన్ 5 : రాష్ట్ర బీసీ, రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం చేర్యాల, కొమురవెల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, మల్లన్న ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు మంత్రి పొన్నంను కలిసి మల్లన్న ఆలయ ప్రసాదం అందించారు. పార్టీ రాజకీయ పరిస్థితులతో పాటు భువనగిరి పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై చర్చించారు.

మర్పడగ మల్లన్నకు అన్నాభిషేకం



మర్పడగ మల్లికార్జునస్వామి

కొండపాక, జూన్ 5: కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని సంతాన మల్లికార్జున స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా విజయదుర్గా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లఘున్యాస పూర్వకంగా సంతాన మల్లికార్జున స్వామికి అన్నాభిషేకం నిర్వహించి, అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

మర్కుక్, జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మర్కుక్ మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్కుక్ మండల కేంద్రంలో ఎంపీడీవో అబ్దులుద్దీన్, చేబర్తి గ్రామంలో మాజీ సర్పంచ్ అశోక్, మాజీ ఉపసర్పంచ్ స్వామి ఉపాధిహామీ కార్మికులనుద్దేశించి ప్లాస్టిక్ నిషేదంపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కార్మికులు మోదుగ ఆకులతో విస్తరాకులు కుట్టి ప్లాస్టిక్ నిషేధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. మధ్యాహ్న భోజనాలు ప్రకృతి సిద్ధమైన మోదుగ ఆకులలోనే చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్, మోన, అంగన్‌వాడీ టీచర్లు రాణి, స్వప్న, ఫీల్డ్ అసిస్టెంట్‌లు లలిత, నాయకులు జయరాం, కరుణాకర్, ఉపాధిహామీ కార్మికులు తదితరులుపాల్గొన్నారు.